
# సాక్షి గుంటూరు

గురువారం। 7। డిసెంబర్। 2023

## వరద నీరు విడుదల

తాడేపల్లిరూరల్ : ఎగువన భారీ వర్షాలు కురవడంతో బుధవారం ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇరిగేషన్ అధికారులు స్వల్పంగా గేట్లు ఎత్తి దిగువకు 18,500 క్యూసెక్కుల వరద నీటిని వదిలారు.



## దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.

## శతాధిక వృద్ధుడు మృతి



గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామానికి చెందిన పసుమర్తి శ్యామ్యూల్‌జాన్ (101) బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. అతనికి ఐదుగురు సంతానం. భార్య కాంతమ్మ గతంలోనే మరణించారు. శ్యామ్యూల్‌జాన్ వ్యవసాయ పనులు చేస్తుండేవారు.



దుగ్గిరాల మండలంలో విరిగిపోయిన అరటి గెలలను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



నూతక్కి, రామచంద్రాపురంలలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు



చేబ్రోలు మండలం వడ్లమూడిలోని ఎంపీపీ స్కూల్ పునరావాస కేంద్రంలోని బాధితులకు బియ్యం, నిత్యావసరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

# దైన్యంలో ధైర్యం

**వాయువేగంతో సహాయక చర్యలు**

- పంటల రక్షణే ధ్యేయంగా ముందుకు..
- రంగంలోకి అధికార యంత్రాంగం
- తుఫాన్ వల్ల నీట మునిగిన 1.20 లక్షల ఎకరాలు
- 93,000 ఎకరాల్లో వరికి నష్టం
- నీరు బయటకు పంపేలా ముమ్మర చర్యలు
- యుద్ధప్రాతిపదికన కాలువల్లో పూడిక తొలగింపు
- పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆశ్రయం



బుడంపాడు వద్ద ప్రధాన రహదారిపై గండికొట్టి వరద నీటిని పంపుతున్న పోలీసులు, అధికారులు



తాడికొండ వద్ద దెబ్బతిన్న మినుము పైరు



తాడికొండ- కంతేరు మధ్య ఎర్రవాగు లో లెవల్ చప్టాపై నీరు చేరడంతో నిలిచిన రాకపోకలు



ఉండవల్లి వద్ద తుపానుకు దెబ్బతిన్న అరటి తోటలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన పంటలను కాపాడటమే లక్ష్యంగా అధికార యంత్రాంగం ముందుకు కదిలింది. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి , జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, తెనాలి, మంగళగిరి, పొన్నూరు ఎమ్మెల్యేలు అన్నాబత్తుని శివకుమార్, ఆళ్ల రామకృష్ణారెడ్డి, కిలారు రోశయ్య, ఇతర ప్రజాప్రతినిధులు కూడా బుధవారం ఉదయం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. పొలాల్లో ఉన్న నీరు బయటకు వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. సాధ్యమైనంత త్వరగా పంట పొలాల్లో ఉన్న నీటిని బయటకు పంపడం ద్వారా పంటల రక్షణే ధ్యేయంగా అడుగులు వేశారు. ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారులతోపాటు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ, ప్రత్యేక అధికారులు పనులు పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేశారు.

**తక్షణం నిధులు మంజూరు**

వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదిక ప్రకారం జిల్లాలో 93 వేల ఎకరాల్లో వరి, 16వేల ఎకరాల్లో పెసర, నాలుగు వేల ఎకరాల్లో మినుము, 8 వేల ఎకరాల్లో అరటి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. చాలా పొలాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. ఈ నీటిని త్వరగా బయటకు పంపేందుకు ఉపాధి హామీ కూలీల ద్వారా పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అవసరమైన చోట్ల యంత్రాలను వినియోగించాలని నిర్ణయించారు. దీనికి కావాల్సిన నిధులను తక్షణం కలెక్టర్ మంజూరు చేశారు. ఉన్నతాధికారులందరూ ఉదయం నుంచి క్షేత్రస్థాయిలోనే ఉండి పనులు పర్యవేక్షించారు. పొలాల్లోని నీటిని సమీపంలోని డ్రెయిన్లు, కాలువల్లోకి పంపారు.

**సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో వేగంగా చర్యలు**

తుఫాన్ బాధితులందరినీ ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారయంత్రాంగం అన్ని చర్యలూ చేపట్టింది. దాదాపు అన్ని గ్రామాల్లో వర్షాలు కురిసినందున పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. డ్రెయినేజీలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టింది. దోమలు, లార్వా నిర్మూలనకు సిబ్బంది ఫాగింగ్ నిర్వహిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజలకు సరఫరా చేసే నీటిని క్లోరినేషన్ చేస్తున్నారు. ఇళ్లలోకి నీరు చేరి పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న బాధితులకు ప్రభుత్వం నిర్దేశించినట్టు 25 కేజీల బియ్యం, లీటర్ పామాయిల్, కేజీ కందిపప్పు, కేజీ బంగాళదుంపలతో కూడిన నిత్యవసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వ్యక్తికి రూ.1,000, కుటుంబానికి అయితే రూ.2,500 నగదును పునరావాస కేంద్రాలలోనే అందించారు.

**క్షేత్రస్థాయికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు**

- తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలను కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. పెదకాకాని మండలం ఉప్పలపాడు, వెంకట కృష్ణాపురం, తెనాలి మండలంలోని హాఫ్ పేట, దుగ్గిరాల మండలం ఈమని గ్రామాలలో బుధవారం ఆయన స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి పర్యటించారు. రైతులతో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు.
- జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ప్రత్తిపాడు నియోజకవర్గం పాత మల్లాయపాలెం, కొత్త మల్లాయపాలెం గ్రామాల్లో పర్యటించారు. ప్రత్తిపాడు పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సాయిబాబా గుడి వద్ద ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కూడా జేసీ పరిశీలించారు.
- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య వెల్లలూరు పచ్చలతాడిపర్రు, మామిళ్ళపల్లి, ములుకుదురు, గొల్లమూడిపాడు గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ములుకుదురు గ్రామంలో ఇల్లు కోల్పోయిన మహిళకు తక్షణ సహాయంగా రూ.5 వేలు అందించారు.
- మంగళగిరి నియోజకవర్గ పరిధిలో గుండిమెడ, నూతక్కి, రామచంద్రాపురంలలో దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి పరిశీలించి రైతులతో మాట్లాడారు.
- తెనాలి రూరల్ మండలంలోని హాఫ్‌పేట గ్రామంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పర్యటించారు. రైతులతో మాట్లాడారు.

## చాలా బాగా చూసుకున్నారు



మేము పూలే కాలనీలో నివాసం ఉంటున్నాం. కూలీనాలి చేసుకుని జీవించేవాళ్లం. తుఫాన్ వస్తుందని ముందుగానే అధికారులు చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం మా ఇళ్లలోకి నీరు రావడంతో వలంటీర్‌కు సమాచారం ఇచ్చాం. వెంటనే మమ్మలను స్థానిక లయోలా పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం భోజనం అందించారు. డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. మందులు ఇచ్చారు. చాలా బాగా చూసుకున్నారు. ఇంటికి వచ్చేటప్పుడు బియ్యం, పప్పులు, కూరగాయలు ఇచ్చి పంపారు. ప్రభుత్వానికి, జగన్‌బాబుకు రుణపడి ఉంటాం.

– గంజి వెంకటేశ్వర్లు, నాగమల్లేశ్వరి, వెంగళాయపాలెం పూలే కాలనీ

## జగనన్న తుఫాన్ నుంచి రక్షించారు



గతంలో వర్షం కురిస్తే ఇళ్లలోకి నీరు వచ్చినా అలాగే మంచాలపై కాలంగడిపేవారం. ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో గంటగంటకు వలంటీర్లు వచ్చి మా బాగోగులపై ఆరా తీశారు. ఇళ్లలోకి నీరు రావడంతో వెంటనే పునరావాస కేంద్రానికి తరలించారు. రెండు రోజులపాటు మాకు అల్పాహారం, భోజనం అందించారు. వైద్యులకు చూపించి మందులు ఇచ్చారు. 25 కిలోల బియ్యం, కందిపప్పు, నూనె, కూరగాయలు వంటి నిత్యావసర సరకులు ఇచ్చి జాగ్రత్తగా మా ఇళ్ళ వద్దకు చేర్చారు. మేము ఇళ్ళకు వచ్చేలోగా మా ఇళ్ళ వద్దనున్న నీటిని మోటార్లతో తోడించి శుభ్రం చేశారు. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. ఇలాంటి ముఖ్యమంత్రే ప్రజలకు కావాలి.

– కొండా ఇందిర, కుసుమ, పార్వతి, రుక్మిణి, మల్లేశ్వరి వెంగళాయపాలెం పూలేనగర్

## న్యూస్‌రీల్

### 16, 17న స్విమ్మింగ్ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీలలో రాష్ట్రస్థాయి 9వ సబ్‌జూనియర్, జూనియర్ బాలల వింటర్ ఆక్వాటిక్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలు, రాష్ట్ర జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనే జిల్లా సబ్‌జూనియర్, జూనియర్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 10వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్టు వివరించారు. పట్టణంలోని సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో ఈపోటీలు జరగనున్నట్టు వెల్లడించారు. స్విమ్మింగ్‌తోపాటు వాటర్‌పోలో జట్టు ఎంపికలూ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 9న శనివారం లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

### అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: అమరేశ్వరాలయంలో స్వామికి బుధవారం దాతల సహకారంతో లక్షబిల్వార్చనను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ అర్చకులు, వేద పండితులు జరిపించారు. తొలుత మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ వేద పండితులు గణపతి హోమం, సూర్యనమస్కారాలు నిర్వహించారు. స్వామికి విశేష అలంకరణ చేశారు. అనంతరం సహస్ర నామాలతో రుత్విక్కులు అమరేశ్వరునికి లక్ష బిల్వ దళార్చన నిర్వహించారు. బాలచాముండికా అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు

### పులిచింతలకు వరద నీరు



అచ్చంపేట : నదీ పరీవాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు పులిచింతల ప్రాజెక్టులో వరదనీరు వచ్చిచేరడంతో జలాశయంలో నీటి నిల్వ ఒక టీఎంసీ పెరిగింది. ప్రాజెక్టులో నిన్నమొన్నటి వరకు 13.7200 టీఎంసీలు ఉండగా, బుధవారం సాయంత్రానికి 14.8260 టీఎంసీలకు పెరిగింది. ఎగువ నుంచి 1,0231 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

### సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 522.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 8,036, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 837.90 అడుగుల వద్ద ఉంది.

### యార్డుకు 18,688 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 18,688 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 17,861 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 23,300 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,807 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

# గుంటూరు నల్ల డ్రెయిన్‌లో పూడిక తొలగించండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- తుఫాన్ వల్ల దెబ్బతిన్న పొలాల పరిశీలన



హాఫ్‌పేటలో పంటను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

తెనాలిటౌన్: హాఫ్‌పేట గ్రామాన్ని బుధవారం కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ సందర్శించారు. మిచాంగ్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న వరిపొలాలను పరిశీలించారు. నష్టం వివరాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. పొలాల్లోని వర్షపు నీటిని సత్వరం బయటకు పంపడంలో కీలకపాత్ర పోషించే గుంటూరు నల్ల డ్రెయిన్‌ను పరిశీలించారు. డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపుడెక్కను వెంటనే పొక్లెయిన్‌తో తొలగించాలని ఇరిగేషన్, డ్రెయినేజి అధికారులను ఆదేశించారు. పొలాల్లో నుంచి డ్రెయిన్‌కు వచ్చే మురుగు తూములను పరిశీలించారు. వాటికి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో శిథిలావస్థకు చేరిన వంతెనను పరిశీలించారు. ఎనిమిది దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. చెరువు పక్కనే కాల్వలో చెత్తాచెదారం వేయడంపై అధికారులను ప్రశ్నించారు. అక్కడి నుంచి వెంటనే చెత్తను తొలగించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు ఉన్నారు. అనంతరం తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో మండలంలోని గ్రామాల్లో వరిపైరు నీట మునగటం బాధాకరమని అన్నారు. హాఫ్‌పేట గ్రామంలో దెబ్బతిన్న వరిపైరును ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. రైతులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వనజ, ఎంపీడీఓ ప్రతాపరెడ్డి, తహసీల్దార్ కె.రవిబాబు, ఏడీఏ ఉషారాణి, ఏవో ప్రేమసాగర్, డీఎస్పీ బి.జనార్దనరావు, ఇరిగేషన్ డీఈఈ ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, హాఫ్‌పేట సర్పంచ్ తలమాల యర్రయ్య, విద్యుత్ ఏఈ వసంతరావు పాల్గొన్నారు.

# తగిన చర్యలతో వరి పంట రక్షణ

**జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు సూచనలు**

కొరిటిపాడు(గుంటూరు): తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి రక్షణకు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు పలు సూచనలు చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయనేం చెప్పారంటే..

**కోతకు 10 నుంచి 15 రోజులు ఉన్న దశలో...**

చేను పడిపోయి నీట మునిగితే, బూజు తెగుళ్ల వద్ద గింజ రంగు మారిపోయే అవకాశం ఉంది. వర్షాలు తగ్గిన వెంటనే లీటరు నీటికి 1 మిల్లీలీటరు ప్రొపికోనజోల్ లేదా 1 గ్రాము కార్బెండిజం లేదా 2 గ్రాముల కార్బండిజం ప్లస్ మంకోజెట్ చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

**కోత కోసి పనలపై ఉన్న దశలో..**

మనుషులతో కోత కోసిన పనలు వర్షానికి తడిచినట్టయితే గింజ మొలకెత్తకుండా ఉండటానికి లీటరు నీటికి 50 గ్రాముల కల్లు ఉప్పు పనలపై పడేలా పిచికారీ చేయాలి. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్పు కోవాలి. పొలంలో నీరు లేకపోయినట్టయితే మడిలోనే పనలపై ఉప్పు నీరు చల్లుకోవచ్చు. ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే పనలను గట్ల పైకి తెచ్చుకొని పనలు విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవడం ద్వారా గింజలు మొలకెత్తకుండా, రంగు మారకుండా నివారించవచ్చు.

**పనలు కుప్ప వేసే దశలో..**

కుప్ప వేసే సమయంలో తుఫాన్ లేదా అకాల వర్షాల వల్ల పనలు తడిచినట్టయితే కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు.

**నూర్చిన ధాన్యం కళ్లాలపై ఉన్నప్పుడు...**

నూర్చిన ధాన్యం 2 నుంచి 3 రోజులు ఎండబెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి దుర్వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక కింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పును, 20 కిలోల పొడి ఊక లేదా నాలుగు కిలోల వరి గడ్డితో కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తి చెడిపోకుండా నివారించు కోవచ్చు. ఎండ కాసిన తర్వాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పారబెట్టి నిలువ చేసుకోవాలి.

**పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

పత్తి పంట చేలలో వర్షపు నీరు నిలవకుండా, వర్షపు నీరు వేగంగా, సులభంగా బయటకు పోయేలా చేల గట్లకు ఎక్కువ సంఖ్యలో వాలుకూ నిలువుగా గండ్లు పెట్టాలి. కాయలు విచ్చుకుని ఉన్న పత్తి, తీతకు సిద్ధమైన కాయల నుంచి పత్తిని తీసుకోవాలి. వానలు తగ్గిన తర్వాత పత్తి పంటకు ఎండు తెగులు సోకకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు యాజమాన్య పద్ధతులు పాటించి తెగుళ్లను నివారించుకోవాలని నున్నా వెంకటేశ్వర్లు సూచించారు.

# కూలిన చారిత్రక ఆలయ శిఖరం



భారీ వర్షాలకు కొణిదెనలో కూలిన ఆలయ శిఖరం


బల్లికురవ: ఎంతో చరిత్ర కలిగిన ఆలయం ఆరేళ్లుగా జీర్ణావస్థతో కూలే దశకు చేరింది. కానీ ఏ అధికారీ పట్టించుకోలేదు. ఫలితంగా మిచాంగ్ తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు బుధవారం ఆలయ శిఖరం కూలింది. బల్లికురవ మండలంలోని కొణిదెన గ్రామాన్ని 12వ శతాబ్దంలో చోళ రాజులు పాలించారు. అప్పట్లో గ్రామంలో 101 బావులు తవ్వారని ప్రతీతి. 101 శిలలు ఏర్పాటు చేశారని చెబుతారు. గ్రామానికి ఆగ్నేయ భాగంలో ఎత్తైన కొండపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయాన్ని అప్పట్లో చోళ రాజులు నిర్మించారు. ఈ ఆలయానికి 36 ఎకరాల భూములు ఉన్నాయి. ఆలయం జీర్ణావస్థకు చేరటంతో గత ప్రభుత్వ హయాంలో గ్రామస్తులు పురావస్తు శాఖకు, దేవదాయ శాఖకు ఫిర్యాదు చేశారు. అయితే ఎవరూ పట్టించుకోలేదు. ఆలయ భూముల కౌలు వేలం ఏటా దేవదాయ శాఖకు వెళుతోంది. ఈ క్రమంలో ఆలయ వెనుక భాగంలోని శిఖరం కూలటంతో భక్తులు, అర్చకుడు ఆలయంలోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా రెండు శాఖలూ సమన్వయంతో ఆలయాన్ని అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకురావాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## తక్షణమే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



తాడికొండ: మిచాంగ్ తుఫాన్ వల్ల ఏర్పడిన విద్యుత్ అంతరాయాన్ని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించినట్లు సీఆర్డీఏ విద్యుత్ సర్కిల్ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్డీఏ సర్కిల్ పరిధిలోని 12 మండలాలు, మున్సిపాలిటీలో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిందని, వీటన్నింటినీ ఏపీ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పద్మ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు తుఫాన్ తీరం దాటిన 18 గంటల్లోపే మరమ్మతులు చేసి పునరుద్ధరించామన్నారు. అతి తక్కువ సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో పాటు జరిగిన నష్టాన్ని అంచనాలు రూపొందించి ఏపీసీపీడీసీఎల్ సంస్థకు సమర్పించినట్లు తెలిపారు.

# తుఫాన్ పునరావాస కేంద్రం పరిశీలన




భోజన సదుపాయాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాజకుమారి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని సాయిబాబా గుడి వద్ద ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన తుఫాన్ పునరావాస కేంద్రాన్ని బుధవారం జాయింట్ కలెక్టర్ రాజకుమారి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి వలస వచ్చిన 30 కుటుంబాల వారు రోడ్డు పక్కనే చిన్నచిన్న గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారని, గాలి, వాన వల్ల వారి గుడిసెలు పూర్తిగా దెబ్బతినడంతో తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారని, వెంటనే ఆయన పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారని వివరించారు. ఎంటీఎంసీ కమిషనర్, తాడేపల్లి తహసీల్దార్ సంయుక్తంగా పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి బాధితులకు ఆశ్రయం కల్పించారని వివరించారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు వీరికి ఇక్కడే వసతి కల్పిస్తున్నామని, త్వరలోనే వీరికి మెరుగైన సౌకర్యాలు కల్పించి తరలిస్తామని వెల్లడించారు. అల్పాహారంతోపాటు భోజన ఏర్పాట్లను జేసీ పరిశీలించారు. కార్యక్రమంలో తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి, డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, డెప్యూటీ తహశీల్దార్ సతీష్ పాల్గొన్నారు.

# హోం గార్డుల సహకారం ప్రశంసనీయం

**జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్**



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

**నగరంపాలెం:** శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ఇతరత్రా కేసుల పురోగతిలో హోం గార్డుల సహకారం ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో బుధవారం హోం గార్డు వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో హోంగార్డుల సంక్షేమం కొరకు పలు పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి హోంగార్డు నీతి, నిజాయతీ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని చెప్పారు. తద్వారా హోంగార్డ్ వ్యవస్థకు, పోలీస్ శాఖకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. 1963లో హోంగార్డ్ వ్యవస్థ ఆవిర్భవించిందని వివరించారు. అప్పటి నుంచి వారి సేవలు, ప్రాధాన్యాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా డిసెంబరు ఆరో తేదీన హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని హోంగార్డు పోలీస్ శాఖలో అంతర్భాగమని వెల్లడించారు. శాంతి భద్రతల పరిరక్షణ, బందోబస్త్, నేర నియంత్రణ, టెక్నికల్ విభాగాలు, ట్రాఫిక్ నియంత్రణ, విపత్తుల నిర్వహణలో పోలీసులతో సమానంగా వారు విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఇదే స్ఫూర్తిని ముందు రోజుల్లోనూ కొనసాగించాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో మరింత మెరుగ్గా విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా ఏఎస్పీలు ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్ మహేష్ (సెబ్) మాట్లాడుతూ హోంగార్డుల విధులు, సేవలు మరువలేమని అన్నారు. పోలీసులతో పాటు హోంగార్డులు సమానంగా విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పోలీస్ శాఖకు వారు అందిస్తున్న సహకారం మరువలేమని చెప్పారు. సమావేశంలో డీఎస్పీలు బాలసుందరరావు (ట్రాఫిక్), చంద్రశేఖర్‌రావు(ఏఆర్), ఎస్బీ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రమేష్ కృష్ణన్, రాఘవయ్య, రాజారావు, ఆర్ఎస్ఐలు, ఎస్పీ సీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

- రాత్రి వేళల్లో అందుబాటులో పీహెచ్‌సీ సేవలు
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు

**గుంటూరు మెడికల్:** జిల్లాలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది సేవలందించాలని కోరారు. బుధవారం వైద్య అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఆదేశాలు జారీ చేశారు. కాకుమాను మండలం కొండపాటూరు ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాల, చేబ్రోలు మండలం వడ్లమూడి ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాల, ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాల, వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్, అనంతవరప్పాడు జిల్లాపరిషత్ హైస్కూల్, వట్టిచెరుకూరు జిల్లాపరిషత్ హైస్కూల్, తాడేపల్లి ఆర్ఎంఎస్ కాలనీ ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాల, పెదకాకానిలోని దర్గాప్రాంతం, పెదకాకాని మండలం నంబూరు జెడ్పీ హైస్కూల్‌లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రాత్రి సమయంలో కూడా తెరిచి ఉంచుతారన్నారు. ప్రత్యేక శిబిరాల్లోనే వైద్యులు బస చేయాలని చెప్పారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు సంబంధిత ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు సక్రమంగా నిర్వహించేలా చూడాలని కోరారు.

## ప్రత్తిపాడులో 163 మి.మీ. వర్షం

**కొరిటిపాడు(గుంటూరు):** గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 163 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 55.4 మి.మీ. వర్షం పడింది. వివరాలు... మేడికొండూరు 145.8, పెదనందిపాడు 130.6, చేబ్రోలు 127.8, ఫిరంగిపురం 122.4, గుంటూరు పశ్చిమ 110.6, తాడికొండ 110.4, గుంటూరు తూర్పు 108.4, మంగళగిరి 100.2, దుగ్గిరాల 95.4, తాడేపల్లి 87.4, తుళ్ళూరు 85.8, పెదకాకాని 84, కాకుమాను 78.6, వట్టిచెరుకూరు 68.2, కొల్లిపర 63.4, తెనాలి మండలంలో 60.4 మి.మీ. చొప్పున వర్షం పడింది. డిసెంబరు మాసంలో సాధారణ వర్షపాతం 3.1 మి.మీ. కాగా ఇప్పటి వరకు 182.2 మి.మీ. నమోదైంది.





# రైతులకు అండగా ప్రభుత్వం

**కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి**


పాతమల్లాయపాలెంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును పరిశీలిస్తున్న జేసీ రాజకుమారి

**గుంటూరు వెస్ట్:** మిచాంగ్ తుఫాన్ వలన రైతులకు భారీ పంట నష్టం జరిగిందని, అధికారులు వారికి అండగా నిలిచి సహాయమందించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారులతో మాట్లాడారు. సుమారు లక్ష ఎకరాల్లో వరి, మరో 20 వేల ఎకరాల్లో ఇతర పంటలు, 18 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు చెప్పారు. తక్షణ సాయంతో వ్యక్తి అయితే రూ.1000, కుటుంబం అయితే రూ.2,500 అందించాలని కోరారు. దీంతో పాటు 25 కిలోల బియ్యం, లీటర్ పామాయిల్, కిలో కంది పప్పు, కిలో బంగాళ దుంపలతో కూడిన కిట్ బాధితులకు అందజేయాలని ఆదేశించారు. అందుకు ఎంత మొత్తం కావాలన్నా అందిస్తానని కలెక్టర్ భరోసా ఇచ్చారు. నష్టపోయిన వారికి చేతనైన సాయం చేసేందుకు పనిచేయాలని కోరారు. భారీ వర్షాల కారణంగా పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని తక్షణం తీసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కోరారు. దీని కోసం కావాల్సిన మిషన్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. దీనిపై ఆర్డీఓ, సబ్ కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పాడైపోయిన ఇళ్లకు సంబంధించిన వివరాలను అందించాలని సూచించారు. కంటి తుడుపుగా ఎవరైనా పనిచేసినట్లు తెలిస్తే ఉపేక్షించనని కలెక్టర్ హెచ్చరించారు.

**పక్కాగా పంట నష్టం నమోదు**
**జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి**

**పాతమల్లాయపాలెం(ప్రత్తిపాడు):** పంట నష్టం వివరాలను యంత్రాంగం పక్కాగా నమోదు చేయడం జరుగుతుందని, రైతాంగం ధైర్యంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి తెలిపారు. మండలంలోని పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం గ్రామాల్లో మిచాంగ్ తుపాను ప్రభావంతో నీట మునిగిన పంట పొలాలను వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో కలసి జేసీ బుధవారం పరిశీలించారు. వరి, మిర్చి, పత్తి, శనగ పంటలలు సాగు చేసిన రైతులతో మాట్లాడారు. పంట కాలువల్లోని అడ్డంకులను తొలగించి నీరు ముందుకుపారేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రైతులు అధైర్యపడవద్దని వ్యవసాయ అధికారులు పంట నష్ట వివరాలను నమోదు చేస్తారని భరోసా నిచ్చారు. పునరావాస బాధితులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జి.సిద్ధార్థను ఆదేశించారు. ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంతో పాటు నీట మునిగిన వైఎస్సార్ కాలనీలో నీట మునిగిన గృహాలను జేసీ పరిశీలించారు.

**అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు**

వర్షాలనంతరం గ్రామాల్లో, పట్టణాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. క్రమం తప్పకుండా ఫాగింగ్‌తోపాటు మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. నీటిని ప్రతి రోజూ పరీక్షించాలన్నారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కృషి కారణంగా ప్రాణనష్టం జరగలేదని చెప్పారు. రానున్న రోజుల్లోనూ ఈ సర్వీసుల్ని కొనసాగించాలని కోరారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో చంద్రశేఖరరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, జిల్లా వైద్య శాఖాధికారి శ్రావణ్ బాబు పాల్గొన్నారు.

# భారతరత్న అంబేడ్కర్ ఓ విజ్ఞాన గని

- ఆయనలోని జ్ఞాన సమపార్జన మరెవ్వరికీ సాధ్యం కాలేదు
- సమ సమాజ స్థాపనతోనే అంబేడ్కర్ కు నిజమైన నివాళి
- ఏపీ సివిల్ సప్లయిస్ వీసీఎండీ జి.వీరపాండియన్


డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జి.వీరపాండియన్


ఎన్జీరంగా వర్సిటీలో నివాళులర్పిస్తున్న వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మి


జెడ్పీలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

**ఏఎన్‌యూ:** అంబేడ్కర్ అంటేనే విజ్ఞాన గని అని ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ, ఏపీ మార్క్‌ఫెడ్ జాయింట్ ఎండీ జి.వీరపాండియన్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 64వ వర్ధంతి కార్యక్రమానికి వీరపాండియన్ ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ అంబేడ్కర్‌లోని జ్ఞాన సమపార్జన ప్రపంచంలో మరొకరికి సాధ్యం కాలేదనే భావన ప్రపంచవ్యాప్తంగా అందరూ అంగీకరిస్తున్నారన్నారు. అందుకే ఆయన ప్రపంచ మేధావిగా కొనియాడబడుతున్నాడని తెలిపారు. అంబేడ్కర్ కలలుగన్న సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాసినప్పటినుంచి నేటి వరకు ఆయన కలలుగన్న స్వరాజ్య స్థాపనలో వెనుకబడే ఉన్నామన్నారు. ఇప్పటికీ ఆ విధంగా కృషి చేయడంలో మనం సఫలీకృతం కాలేకపోతున్నామని తెలిపారు. ఆయన ఆశయాలను భావితరాలకు అందించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. అంబేడ్కర్ కేవలం రాజకీయ రంగంలోనే కాకుండా ఆర్థిక, న్యాయ శాఖ, సాంఘిక, సామాజిక రంగాలలో మహా మేధావిగా కొనియాడబడుతున్నాడన్నారు. అంబేడ్కర్ మేధస్సు ప్రతి భారతీయునికి ఆయన రాసిన రాజ్యాంగం ద్వారా వచ్చిందన్నారు. గౌరవ అతిథి ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో మనదేశంలో ఒక రాష్ట్రంలో ప్రభుత్వానికి గవర్నర్‌కు మధ్య విభేదం వచ్చిందని దానికి రాజ్యాంగం పరిష్కారం చూపించిందని గుర్తు చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ ప్రసంగాలను 17 గ్రంథాలుగా ప్రచురించిందన్నారు. వాటిని విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు విద్య, వైద్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. వీసీ ఆచార్య పి రాజశేఖర్ మాట్లాడుతూ అంబేడ్కర్ గురించి తెలుసుకోవడం భావోద్వేగ అధ్యయనం అన్నారు. అంబేడ్కర్ మేధస్సు ప్రపంచానికి ఎంతో అవసరంగా మారిందన్నారు. ప్రపంచ తత్వవేత్త జాక్ డెరిడా ప్రతిపాదించిన సూత్రాలు అంతకుముందే అంబేడ్కర్ ప్రతిపాదించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ టెల్ టూంబ్ డే రాసిన ద రాడికల్ ఇన్ అంబేడ్కర్ అనే గ్రంథాన్ని వీసీ విశదీకరించారు. రెక్టర్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ప్రిన్సిపాల్స్ గంగాధరరావు, పి.సిద్దయ్య, సురేష్‌కుమార్, సీడీసీ డీన్ కె.మధుబాబు, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**గొప్ప రాజ్యాంగం అంబేడ్కర్ ఘనతే..**
**–జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా**

**గుంటూరు ఎడ్యుకేషన్:** భారతదేశ రాజ్యాంగాన్ని ప్రపంచానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కే దక్కుతుందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా పేర్కొన్నారు. బుధవారం బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ అట్టడుగువర్గాల అభ్యున్నతికి తపించిన అంబేడ్కర్ పటిష్టమైన రాజ్యాంగానికి రూపకల్పన చేశారని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా అంబేడ్కర్ గొప్ప మేధావిగా కొనియాడబడ్డారని, బడుగు, బలహీనవర్గాలకు ఆయన ఆరాధ్య దైవమని కొనియాడారు. జెడ్పీ అకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు, ఏఓలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**ప్రపంచ ప్రఖ్యాత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్**

**గుంటూరు రూరల్:** ప్రపంచం గర్వించదగిన రాజ్యాంగాన్ని భారతావనికి అందించిన ఘనుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి తెలిపారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా లాంఫాంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశానికి లేని రాజ్యాంగాన్ని మనకు అందించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ ఎంఎస్ చైతన్యకుమారి, రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి.కరుణాసాగర్, పీజీ డీన్ డాక్టర్ ఎన్వీ రమణ, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డాక్టర్ పి.సాంబశివరావు, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ మణి, కమ్యూనిటీ సైన్స్ డీన్, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, ఎగ్జామినేషన్ కంట్రోలర్ డాక్టర్ పి.సుధాకర్, ఎస్టేట్ ఆఫీసర్ డాక్టర్ పి.రవి, లాం సహసంచాలకులు డాక్టర్ జీఎంవీ ప్రసాదరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ అంబేడ్కర్ సేవలు అసమానం


డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాణిక్య వరప్రసాద్

**కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి**

**గుంటూరు వెస్ట్:** ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు అసమానమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి కొనియాడారు. అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశాన్ని నడిపించేందుకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర ఎంతో ఉందని చెప్పారు. ఆయన సేవలను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఏ శ్రావణ్ బాబు, జీఎంసీ అడిషనల్ కమిషనర్ ఎస్.జ్యోతి పాల్గొన్నారు.

**మహనీయుడు అంబేడ్కర్**

**పట్నంబజారు:** భారత దేశానికి అరుదైన రాజ్యాంగాన్ని అందించి ప్రజానీకం ఐక్యంగా నడిచేలా మార్గనిర్దేశం చేసిన మహనీయుడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ పేదరికం లేని దేశం కోసం పరితపించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కీర్తించారు. అంబేడ్కర్ భావజాలంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని, అంబేడ్కర్ సేవలు ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం లాడ్జిసెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ నేతలు షేక్ మస్తాన్‌వలి, డాక్టర్ వై.షేక్, భగవాన్, ముంతాజ్ పఠాన్, చిన్నపరెడ్డి, ముత్యాలరాజు, కొలకలూరి కోటేశ్వరరావు, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గనిక ఝాన్సీ, కార్పొరేటర్ శ్రీవల్లి, మేరి, కవిత, రజిని పాల్గొన్నారు.

## కుల నిర్మూలన పుస్తకావిష్కరణ



**పాత గుంటూరు:** కుల నిర్మూలన పుస్తకం చదవకుండా భారతదేశ సమాజాన్ని, చరిత్రను అర్థం చేసుకోలేరని ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రచన కుల నిర్మూలన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. సభకు కవి విల్సన్ అధ్యక్షత వహించారు. జూపూడి మాట్లాడుతూ ప్రపంచంలోని 10 మంది మేధావుల్లో ఒకరైన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ భారత దేశంలో జన్మించడం మన అదృష్టం అన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్, సంకూరి రాజారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, కె.జయసుధ, వి.యోహాను, ఎస్ఎం సుభాని, పి.ప్రసాద్ పాల్గొన్నారు.